aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
సోమవారం
08-06-2026 సంపుటి : 01 సంచిక :77 పేజీలు : 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## ప్రజల్లోకి డబుల్ ఇంజన్ విజయగాథ!

- కూటమి శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- రెండేళ్ల కూటమి పాలన, 12 ఏళ్ల మోడీ ప్రభుత్వ విజయాలపై భారీ సభలు
- 9న తిరుపతి, 12న అమరావతి, 15న విశాఖలో బహిరంగ సభలు
- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని నేతలకు సూచన
- సభలకు అన్ని పార్టీల కార్యకర్తలను భారీగా సమీకరించాలని పిలుపు
- వైసీపీ విమర్శలకు ధీటుగా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం
- కూటమి నేతలతో జూమ్ మీటింగ్ లో సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : -07జూన్ (మహాప్రభ,) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు, నరేంద్ర మోడీ ప్రధానిగా పాలన పగ్గాలు చేపట్టి 12 ఏళ్లు అయింది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలన విజయాలపై రాష్ట్రంలో నిర్వహించే బహిరంగసభలను విజయవంతం చేయాలని కూటమిలోని రాజకీయ పక్షాల నేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదివారం రాజధాని అమరావతిలో కూటమి పక్షాల నేతలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 9 వ తేదీన తిరుపతి వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభ గురించి వారితో చర్చించారు. ఈ సభకు ఆయా పార్టీల కార్యకర్తలందరినీ ఆహ్వానించాలని వారిని కోరారు. అలాగే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వారికి

-మిగతా 3 లో

## కిషన్ రెడ్డి నీ సంగతేంటో తెలుస్తా

రాష్ట్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి అనుమతులు తేవాలని హెచ్చరిక



- రాజకీయాలు ఎన్నికల వరకే.. ఆపై అభివృద్ధే మా అజెండా
- నగరాల విభజన లబ్ధి కోసం కాదు.. పాలనా సౌలభ్యం కోసమే
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి.. మెట్రో విస్తరణను అడ్డుకోవద్దు
- గుజరాత్, ఢిల్లీలో నదుల ప్రక్షాళన ఓకే.. మన మూసీకి అడ్డంకులా?
- జూన్ 15 లోపు అనుమతులు రాకుంటే.. బరాబర్ సంగతి తేలుస్తాం!

జీహెచ్ఎంసీని ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకే విభజించామని, రాజకీయ లబ్ధి కోసం కాదని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన ప్రారంభోత్సవంలో మాట్లాడిన ఆయన.. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) వంటి అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజల అవసరాలే తమ ప్రభుత్వ అజెండా అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై కూడా విమర్శలు గుప్పించారు.


3 లో



## దేశంలో పడిపోతున్న జననాల రేటు!

- రీప్లేస్‌మెంట్ స్థాయి కంటే దిగువకు
- ప్రమాద ఘంటికలు మోగిస్తున్న కేంద్ర హోం శాఖ నివేదిక
- 21 ఏండ్ల తర్వాత తీవ్రమైన క్షీణత
- 50 కోట్ల వరకు జనాభా తగ్గే ప్రమాదం

3 లో



## దేశంలో నిరుద్యోగ సంక్షోభం..

- డిగ్రీలు, పీహెచ్‌డీలు ఉన్నా దండుగే
- ఫ్యూన్ ఉద్యోగాలూ కరువు
- తక్కువ అర్హత ఉన్న ఉద్యోగానికి ఉన్నత అర్హత వారు అనర్హులన్న సుప్రీంకోర్టు తీర్పుతో మళ్లీ చర్చ

3 లో



## ఒప్పందం కుదిరితేనే ఆంక్షలు ఎత్తివేస్తాం..

- చర్చలు విఫలమైతే బల ప్రయోగం తప్పదు: ట్రంప్

3 లో

## తమిళనాడులో బీజేపీ ఖాళీ



- పార్టీని వీడుతున్న కమలం నేతలు
- అన్నామలై వెంట నడుస్తామని వెల్లడి
- పార్టీ ప్రకటించక ముందే మాజీ ఐపీఎస్‌కు మద్దతు
- గంటల వ్యవధిలో 12లక్షల మంది ఫాలోవర్స్

చెన్నై, -07జూన్ (మహాప్రభ,)
తమిళనాడు బీజేపీలో ఖాళీ అయింది. కీలక పదవుల్లో ఉన్నవారు.. తమ తమ పదవులు వదులుకుని.. పార్టీకి ఇటీవల రాజీనామా చేసి.. ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించిన అన్నామలై వెంట నడిచేందుకు సిద్ధమయ్యారు. తమిళనాడులోని 11 జిల్లాలకు చెందిన బీజేపీ అధ్యక్షులు మూకుమ్మడి రాజీనామా చేయడం.. కనీసం.. ఈ రాజీనామాలు ఆమోదం పొందేవరకైనా వేచి చూడకుండానే.. అన్నామలై వెంట నడుస్తామని చెప్పడం గమనార్హం. ముఖ్యంగా చెన్నై సహా చామరాజనగర్, రామేశ్వరం వంటి బలమైన బీజేపీకి వెన్నుదన్నుగా ఉన్న జిల్లాల్లోనే బీజేపీ ఖాళీ అయిపోయింది. జిల్లా అధ్యక్షులే పార్టీకి రాజీనామా చేయడంతో ఇక్కడి పార్టీ కార్యకర్తలు కూడా జెండా వదిలేశారు.

-మిగతా 3 లో

## దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు



- ఖమ్మం జిల్లా లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి
- విద్యపై పెట్టే ప్రతి రూపాయి.. భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ -07జూన్ (మహాప్రభ,)
రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు కేవలం భవనాలు కావని, అవి రేపటి తరాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దే 'దార్శనిక దేవాలయాలు' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్లు మండలం లక్ష్మీపురంలోని

-మిగతా 3 లో

## బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పథకాల అమలు
సమగ్ర కార్యాచరణ చేపడతాం



- ఈ నెల మూడవ వారంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు
- సహాయ బీసీ సంక్షేమశాఖ అధికారులతో మేధో మధనం
- బీసీ హాస్టళ్లలో అకాడమిక్ ప్రొఫైల్ సిద్ధం చేయాలి
- విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డు ఏర్పాటు చేయాలి
- రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లకు బీసీ స్టడీ సర్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించాలి
- బీసీ సంక్షేమ శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ -07జూన్ (మహాప్రభ,)
: బీసీ సంక్షేమ శాఖ లో చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, హాస్టల్ ల పని తీరు, తదితర అంశాలపై మినిస్టర్ క్వార్టర్స్ లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ప్రభావవంతమైన అమలు మరియు బీసీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ నెల మూడవ వారంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారులు, సహాయ బీసీ సంక్షేమ అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మేధో మధనం నిర్వహించనున్నారు. బీసీ గురుకుల పాఠశాలలు,

-మిగతా 3 లో



## మనుషుల కన్నా ఏఐకే దాహం ఎక్కువ!.

- 2030 నాటికి 130 కోట్ల మంది ప్రాథమిక అవసరాలకు సరిపడా నీరు స్వాహా!
- ఏఐ సర్వర్ల చల్లదనం కోసం.. భారీగా ఆవిరవుతున్న జలవనరులు
- నీటి వినియోగంపై ఐరాస హెచ్చరిక

న్యూఢిల్లీ -07జూన్ (మహాప్రభ,)
విపరీతంగా పెరుగుతున్న కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం వల్ల ఈ దశాబ్దం చివరి నాటికి నీళ్ల వినియోగం కూడా విపరీతంగా పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి(ఐరాస) హెచ్చరించింది. 2030 నాటికి ఏఐ సిస్టమ్స్‌ను నిర్వహించే డాటా కేంద్రాలు 130 కోట్ల మంది ప్రజల ప్రాథమిక గృహ అవసరాలకు సరిపడే నీటిని వినియోగించవచ్చని ఆ సంస్థ నివేదిక అంచనా వేసింది.ఈ సంఖ్య నేడు మొత్తం ఆఫ్రికా ఖండంలో నివసిస్తున్న ప్రజలకు దాదాపు సమానమని తెలిపింది. ఏఐ సర్వర్లను చల్లపరిచేందుకు, వాటికి అవసరమైన విద్యుత్తు ఉత్పత్తికి భారీగా నీళ్లు అవసరమని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నీరు, భూమి, విద్యుత్తుపై కలిగే ప్రభావాలను పరిగణనలోనికి తీసుకొని ఆవిష్కరణలపై బాధ్యతాయుతమైన విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వాలను, సాంకేతిక సంస్థలను, వినియోగదారులను ఐరాస కోరింది.

-మిగతా 3 లో



## తెలంగాణ హక్కులు ఏపీకి తాకట్టు

- చంద్రబాబు ఆనందం కోసం నీటి వాటాల్లో రేవంత్ రాజీ
- గోదావరి-కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- నిమ్మకు నీరెత్తినట్లున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు..
- ఏపీ నీటి దోపిడీపై స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ -07జూన్ (మహాప్రభ,)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి మెప్పు కోసం తెలంగాణ నీటి వాటాలను సీఎం రేవంత్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి, కృష్ణా జలాల వాటాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పు పట్టారు. పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్ట్‌కు 20 టీఎంసీల నీటికి ఏపీ ఎన్‌వోసీ ఇస్తే పోలవరం ప్రాజెక్ట్‌కు అనుకూలమని చెప్పడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

-మిగతా 3 లో

# సామాన్యుడిపై మరో భారం..

**రూ.29 పెరిగిన డొమెస్టిక్ సిలిండర్ ధర!**



**న్యూఢిల్లీ: -07జూన్ (మహాప్రభ,)**
ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరలతో అల్లాడిపోతున్న సామాన్య ప్రజలపై, కేంద్ర ప్రభుత్వం, చమురు కంపెనీలు మరో భారీ భారాన్ని మోపాయి. గృహ అవసరాల కోసం వినియోగించే 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతూ తాజాగా నిర్ణయం తీసుకున్నాయి. తాజా సవరణ ప్రకారం ప్రతి సిలిండర్‌పై రూ.29 మేర ధరను పెంచారు. ఈ ధరల పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో నిన్నటివరకు రూ.913 గా ఉన్న 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధర, ఇప్పుడు ఏకంగా రూ.942 కి చేరుకుంది. పెరిగిన ఈ కొత్త ధరలు జూన్ 7వ తేదీ నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీతో పాటు దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, రాష్ట్రాల్లోనూ ఈ ధరల పెరుగుదల స్థానిక పన్నులను బట్టి వర్తించనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వస్తున్న హెచ్చుతగ్గులు, దిగుమతి వ్యయం పెరగడం వల్లే ఈ ధరలను సవరించాల్సి వచ్చిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఇప్పటికే పెరిగిన కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న మధ్యతరగతి మరియు పేద కుటుంబాల బడ్జెట్‌పై ఈ హఠాత్తు నిర్ణయం మరింత అదనపు భారాన్ని వేయనుంది. ఒకేసారి దాదాపు ముప్పై రూపాయల వరకు గ్యాస్ ధర పెరగడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్..?

**'తిరుచ్చి ఈస్ట్' నుంచి పోటీపై జోరుగా ప్రచారం!**

**ఈ నెల 11న కీలక ప్రకటన చేయనున్నట్లు ట్వీట్ చేసిన స్టార్ హీరో**



**చెన్నై న్యూఢిల్లీ: -07జూన్ (మహాప్రభ,)**
తమిళ సినీ పరిశ్రమ నుంచి మరో స్టార్ హీరో రాజకీయ రంగప్రవేశానికి సర్వం సిద్ధమైనట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రముఖ నటుడు, దర్శకుడు, సామాజిక సేవాకర్త రాఘవ లారెన్స్ త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమిళ స్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (టివికె) పార్టీ తరపున కీలకమైన 'తిరుచ్చి ఈస్ట్' అసెంబ్లీ నియోజకవర్గం నుండి రాఘవ లారెన్స్ బరిలోకి దిగడం దాదాపు ఖాయమైందనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తన రాజకీయ ఎంట్రీపై వస్తున్న వార్తలపై రాఘవ లారెన్స్ స్వయంగా స్పందించారు.

**ఎక్స్ (ట్విట్టర్) వేదికగా లారెన్స్ స్పందన**

తన రాజకీయ ప్రయాణంపై సాగుతున్న ప్రచారానికి లారెన్స్ సోషల్ మీడియా వేదికగా చెక్ పెట్టారు. "నా భవిష్యత్తు కార్యాచరణ.. తదుపరి అడుగుపై ఈ నెల 11వ తేదీన ఒక కీలక ప్రకటన చేయబోతున్నాను. నా అభిమానులు, ప్రజలు అప్పటివరకు దయచేసి వేచి చూడాలి" అని లారెన్స్ తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

# ట్రంప్ వాస్తవంలో జీవించాలి

**-ఇరాన్ విదేశాంగ మంత్రి**



**టెహ్రాన్: -07జూన్ (మహాప్రభ,)**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాస్తవంలో జీవించాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ విమర్శించారు. తమ దేశ సుప్రీం నేత అయాతుల్లా అలీ ఖమేనీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ల మధ్య సమావేశం జరిగే అవకాశం లేదని, ఆ వార్తలు అవాస్తవమని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆయన ఒక సమావేశానికి సిద్ధంగా ఉన్నారని, సమావేశం నిర్వహించాలనుకుంటున్నారని చెప్పినట్లు ఒక నివేదికలో చూశానని అన్నారు. ట్రంప్ వాస్తవికంగా ఉండి, నిజ ప్రపంచంలో ఆలోచించి జీవించాలని సూచించారు. అణ్వాయుధాల తయారీని నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ పేర్కొన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే భవిష్యత్తులో ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీతో సమావేశం అయ్యే అవకాశం ఉందని కూడా ట్రంప్ సూచించారు. ఈ వ్యాఖ్యలను అరాగ్చీ ఖండించారు.

# నీట్ సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు అందుబాటులోకి


**న్యూఢిల్లీ, : -07జూన్ (మహాప్రభ,)**
నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కీలక అప్‌డేట్ ఇచ్చింది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రం ఏ నగరంలో ఉందనే సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించింది.




అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావడం ద్వారా ఈ వివరాలు (సిటీ ఇంటిమేషన్ స్లిప్) పొందవచ్చునని తెలిపింది. పేపర్ లీక్ ఆరోపణలతో మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# ఎల్‌నినో మొదలైంది..

**పసిఫిక్ మహా సముద్రంలో పరిమితి దాటిన ఉష్ణోగ్రతలు**



**న్యూఢిల్లీ: -07జూన్ (మహాప్రభ,)**
ప్రస్తుతం పసిఫిక్ మహా సముద్రంలో వస్తున్న ఒక పెద్ద మార్పు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. 'యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్'(ఈసీఎండబ్ల్యూఎఫ్) తాజా నివేదిక ప్రకారం ఉష్ణ మండల పసిఫిక్ మహా సముద్రం అధికారికంగా ఎల్ నినో ప్రారంభాన్ని సూచించే కీలకమైన ఉష్ణోగ్రత పరిమితిని దాటింది. ఈ వేడెక్కే ధోరణులను ధ్రువీకరించే హై రిజల్యూషన్ డేటాను అందించడంలో 'యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ' కీలక పాత్ర పోషించింది. భారతదేశంలో రుతు పవనాల కాలంలో ఎల్ నినో ప్రారంభం కావడం అనేది అత్యంత అరుదుగా సంభవించే పరిణామం. ఇది దేశంలో వర్షపాతం తగ్గడానికి, మన వ్యవసాయ రంగంలో గణనీయమైన సవాళ్లు ఏర్పడేందుకు దారి తీస్తుంది. రుతు పవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకాయి. ఇది సాధారణం కన్నా మూడు రోజులు ఆలస్యంగా జరిగింది. సీనియర్ వాతావరణశాస్త్రవేత్త ఎం రాజీవన్ తదితరులు ఎల్ నినోతో ముడిపడివున్న వాతావరణ మార్పులు ఇప్పటికే వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అయితే దీనిని అధికారికంగా ప్రకటించాలంటే ఈ పరిస్థితులు మూడు నెలల పాటు కొనసాగాల్సి ఉంటుంది. భారత వాతావరణ శాఖ ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇప్పటికే అంచనా వేసింది. ఆశించిన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతంగా ఉంటుందని తెలిపింది. సీజన్ నడుస్తున్న కొద్దీ పసిఫిక్ వేడెక్కడం, ఇతర వాతావరణ చోదకాలతో ఎలా సంకర్షణ చెందుతుందో శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. వారు ఎల్ నినో పరిస్థితుల కారణంగా తలెత్తే వైవిధ్యాలకు అనుగుణంగా దేశం సిద్ధం అయ్యేందుకు తగిన సమాచారాన్ని అందిస్తారు.

# ఇండియా బ్లాక్ సమావేశానికి మమతా బెనర్జీ..

**టీఎంసీకి కీలకంగా మారనున్న సమావేశం**



**న్యూఢిల్లీ: -07జూన్ (మహాప్రభ,)**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ మళ్లీ రాజకీయంగా పుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా చాలా కాలం తర్వాత ఇండియా బ్లాక్ సమావేశానికి మమత హాజరుకానున్నారు. ఇందుకోసం మమత ఢిల్లీకి బయల్దేరారు. సోమవారం ఈ సమావేశం జరగనుంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఈ సమావేశానికి నేతృత్వం వహించనుందిప్రతిపక్షాల కూటమిగా ఉన్న ఇండియా బ్లాక్ ప్రస్తుతం భవిష్యత్ రాజకీయాలపై దృష్టిపెట్టింది. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వరుసగా ఓటమి చవిచూస్తున్నాయి. బీజేపీ చేతిలో పరాజయం పాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమావేశం కీలకం కానుంది. సమావేశానికి 23 పార్టీలు హాజరవుతాయని కాంగ్రెస్ వెల్లడించింది. టీఎంసీ ఘోర ఓటమి తర్వాత ఆ పార్టీకి ఈ మీటింగ్ కీలకం కానుంది. అక్కడ బీజేపీ భారీ విజయం సాధించింది. ఇది రాజకీయంగా భారీ చర్చకు దారితీసింది. ఇటీవల ముగిసిన ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్ సమావేశం జరగడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ రాజకీయంగా ఎదగడం ఆయా పార్టీలకు ఇబ్బందిగా మారింది. ఇండియా కూటమిలో విబేధాల తర్వాత ఇంతకాలానికి అన్ని ఎక్కువ పార్టీలు ఏకమవుతున్నాయి. ఇండియా బ్లాక్ తన లక్ష్యాల్ని మళ్లీ నిలబెట్టుకోవాలని నిర్ణయించింది. ఇండియా బ్లాక్‌కు నాయకత్వం, సమన్వయం, రాబోయే ఎన్నికల్లో కలిసి పని చేయడంపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, ఈ మీటింగ్‌కు డీఎంకే హాజరు కావడం లేదు. ఇంతకాలం డీఎంకే.. ఇండియా కూటమిలో కీలకంగా ఉంది. అయితే, కాంగ్రెస్ పార్టీ తమిళనాడులు డీఎంకేను కాదని టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీ కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో ఉంది. అందుకే, ఈ కూటమికి డీఎంకే దూరంగా ఉండనుంది.

# భారత్‌లో జననాల రేటు తగ్గుదలపై ఎలాన్ మస్క్ పోస్ట్..

**సోషల్ మీడియాలో చర్చ..!**



**న్యూఢిల్లీ: -07జూన్ (మహాప్రభ,)**
ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ భారత్‌కు సంబంధించి చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశం అయ్యింది. భారత్ లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై మీడియా సంస్థ 'ఏఎఫ్ పోస్ట్' షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. భారత్‌లో జననాల రేటు ప్రతిస్థాపన స్థాయి కంటే తగ్గిందని, ముఖ్యంగా బాగా చదువుకున్న వారిలో ఈ రేటు చాలా ఏళ్ల క్రితమే పడిపోయిందని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని 'ఏఎఫ్ పోస్ట్' నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2 కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొన్నది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025' కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9 గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది. సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది. అయితే జననాల రేటు తగ్గుతున్నప్పటికీ 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలు వంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.

# తృణమూల్ ఎమ్మెల్యే మదన్‌మిత్ర కారుపై కోడిగుడ్లతో దాడి..!

**న్యూఢిల్లీ: -07జూన్ (మహాప్రభ,)**
టీఎంసీ నేత, ఎమ్మెల్యే మదన్ మిత్రా కు చేదు అనుభవం ఎదురైంది. కమార్‌హాటీ నియోజకవర్గంలోని అరియాదయా ప్రాంతంలో కొంత గందరగోళ పరిస్థితులున్నాయనే సమాచారంతో ఆయన అక్కడకు వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న స్థానికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కొందరు ఆగ్రహంతో కోడిగుడ్లు విసరడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. దాంతో ఎమ్మెల్యే కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు వెళ్లిపోయింది. దాడి ఘటనపై మదన్ మిత్రా స్పందిస్తూ.. ఈ ఘటన పూర్తిగా ముందస్తు వ్యూహంపై జరిగినదేనని, బీజేపీ మద్దతుతోనే కొందరు దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే దాడి సమయంలో తాను వాహనంలో లేనని, తన డ్రైవర్‌పై దాడి జరిగిందని చెప్పారు. కాగా దశాబ్దాలుగా 'కట్ మనీ' పేరుతో స్థానిక నేతలు తమవద్ద బలవంతంగా డబ్బులు వసూళ్లు చేశారని, వాటిని తిరిగి ఇవ్వాలని ఆటో-రిక్షా, ఈ-రిక్షా డ్రైవర్లు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. పశ్చిమబెంగాల్‌లో పలువురు టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం



చేస్తున్న వరుస ఘటనల ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నాయి. గత కొద్దివారాలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజలు బహిరంగంగానే నాయకుల అవినీతి ఆరోపణలు, బలవంతపు వసూళ్లు, స్థానిక పాలనాంశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరకూ రాజకీయ ర్యాలీలకే పరిమితమైన ప్రజానిరసనలు ఈ మధ్య కాలంలో రాజకీయ నేతల పర్యటనల్లో చోటుచేసుకుంటున్నాయి. టీఎంసీ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఇటీవల సోనార్‌పూర్‌లో పర్యటించినప్పుడు ఇలాంటి నిరసనలే ఎదురయ్యాయి. అభిషేక్ 'దొంగ' అంటూ నినాదాలు చేసిన నిరసనకారులు ఆయనపై రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. స్థానిక సమస్యలపై నిలదీశారు. ఈ దాడి ఘటనకు సంబంధించి ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అవినీతి ఆరోపణలకు సంబంధించి స్థానిక రాజకీయ నేతలు కోర్టుకు హాజరైన సందర్భాల్లో కోర్టు ఆవరణల్లోనూ, పోలీసు స్టేషన్ల ఎదుట ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. కాగా వరుస దాడుల ఘటనలను టీఎంసీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. అభిషేక్‌పై దాడి ఘటనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్ చేశారు.

## ప్రజల్లోకి డబుల్ ఇంజన్
# విజయగాథ!

మొదటి తరువాయి


సోదాహరణగా వివరించాలని వారికి సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మూడు ప్రాంతాలలో నిర్వహించే సభలను విజయవంతం చేయాలని వారిని సీఎం చంద్రబాబు కోరారు. టీడీపీ నుంచి వల్లభనేని శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, బీజేపీ నుంచి పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

ఇటీవల ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో కూటమిలోని పార్టీల అగ్రనేతలు సమావేశమయ్యారు. ఏపీలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతోపాటు కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఈ సమావేశంలో నేతలు చర్చించారు.

అలాగే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతల విమర్శల జోరుకు అడ్డుకట్ట వేయాలని భావించాయి. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జూన్ 9వ తేదీన తిరుపతిలో.. జూన్ 12వ తేదీన రాజధాని అమరావతిలో.. జూన్ 15వ తేదీన విశాఖపట్నం వేదికగా భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దాంతో ఈ సభలను విజయవంతం చేయాలని ఈ జూమ్ మీటింగ్‌లో ఆయా పార్టీల నేతలను సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# దేశంలో నిరుద్యోగ సంక్షోభం..

**- డిగ్రీలు, పీహెచ్‌డీలు ఉన్నా దండుగే**
**-ప్యూన్ ఉద్యోగాలూ కరువు**
**-తక్కువ అర్హత ఉన్న ఉద్యోగానికి ఉన్నత అర్హత వారు అనర్హులన్న సుప్రీంకోర్టు తీర్పుతో మళ్లీ చర్చ**



**న్యూఢిల్లీ,**
'అధిక విద్యార్హత ఉన్న అభ్యర్థులు తక్కువ అర్హతలు కల అభ్యర్థులకు ఉద్దేశించిన ఉద్యోగాలు పొందడానికి అనర్హులు' అంటూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దేశంలో నిరుద్యోగ సంక్షోభాన్ని మరోసారి చర్చకు లేవనెత్తింది. ఈ దేశంలో లక్షలాది మంది నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు తమ విద్యార్హతకు తగిన ఉద్యోగం పొందడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ప్యూన్ ఉద్యోగానికి కూడా పీహెచ్‌డీ అభ్యర్థులు పోటీపడుతున్న పరిస్థితులు నిత్యకృత్యమయ్యాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. తమ అర్హతకు తగ్గ ఉద్యోగాలివ్వలేని అసమర్థ ప్రభుత్వానికి ఈ విషయంలో బాధ్యత లేదా? అని పలువురు నిరుద్యోగులు అంటున్నారు.

**విద్యార్హతలను బట్టే ఉద్యోగాలు..**
ఒక గ్రాడ్యుయేట్ తన ఉన్నత విద్యార్హతను దాచిపెట్టి 10వ తరగతి అర్హతతో లభించే బ్యాంక్ అటెండర్ ఉద్యోగాన్ని పొందిన కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఉన్నత విద్యార్హతలు ఉన్న అభ్యర్థి తక్కువ అర్హతలు గల అభ్యర్థులకు కేటాయించిన ఉద్యోగం పొందడానికి అనర్హుడని తెలిపి, అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. ప్రభుత్వ శాఖలో గ్రాడ్యుయేట్ అభ్యర్థికి అటెండర్ ఉద్యోగం ఇస్తే కేవలం 10వ తరగతి మాత్రమే చదివి ఆ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసే అభ్యర్థికి అన్యాయం చేసినట్టు అవుతుందన్నారు. దీనిని అనుమతిస్తే దేశంలో ప్రతి గ్రాడ్యుయేట్ అటెండర్, అంతకన్నా దిగువస్థాయి ఉద్యోగాలకు పోటీకి వస్తారని, దీని ద్వారా తక్కువ విద్యార్హత అభ్యర్థికి భవిష్యత్‌లో ఉద్యోగం లభించే అవకాశమే ఉండదని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. ఉద్యోగ నియామక కోణంలో ఇది సరైన వాదనే అయినప్పటికీ, నిరుద్యోగుల కోణంలో చూస్తే ఇది అన్యాయమని అనిపిస్తుంది. ఉన్నత చదువులు చేయడమే తాము చేసిన తప్పా అని వారు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

# ఒప్పందం కుదిరితేనే ఆంక్షలు ఎత్తివేస్తాం..

**చర్చలు విఫలమైతే బల ప్రయోగం తప్పదు: ట్రంప్**



వాషింగ్టన్
అమెరికాతో ఒప్పందం చేసుకునేంత వరకు ఇరాన్‌పై ఆంక్షల్ని ఎత్తివేయబోమని, స్తంభింపజేసిన ఆస్తుల్ని విడుదల చేయబోమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం చర్చల ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడుతూ, 'ఇరాన్‌తో తుది ఒప్పందం కుదిరే వరకు, ఆ దేశంపై ఆంక్షల సడలింపునకు ఆస్కారమే లేదు.ఇరాన్ నాయకత్వం ఒక ఒప్పందానికి అంగీకరించి, తన కట్టుబాట్లను నెరవేర్చిన తర్వాత ఆర్థిక ఒత్తిడిలో సడలింపు వస్తుంది' అని అన్నారు. ఒప్పందం కుదిరితే.. యురేనియం నిల్వల్ని నాశనం చేయడానికి ఇరాన్‌తో అమెరికా కలిసి పనిచేస్తుందన్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే బలప్రయోగానికి అమెరికా సిద్ధమవుతుందని ట్రంప్ హెచ్చరించారు.

# తమిళనాడులో బీజేపీ ఖాళీ

మొదటి తరువాయి



వందల మంది తమ నాయకుల వెంటే నడుస్తామని తేల్చి చెప్పారు. మరోవైపు.. అన్నామలై.. తనకు నటుడు రజనీకాంత్ మద్దతు ఉందని.. గతంలోనే ఆయన తన వెంట నడవాలని పిలుపునిచ్చారని చెప్పిన విషయం తెలిసిందే. అనేక మంది యువత అన్నామలై.. సోషల్ మీడియాను ఫాలో అవుతున్నట్లు తెలిపారు. కేవలం 10 గంటల్లోనే 12 లక్షల మంది అన్నామలై ప్రకటించిన ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. అయితే.. ఇంత జరుగుతున్నా బీజేపీ మాత్రం తమకు ఏమీ కాదని, పోయే వారంతా.. పోయినా.. ప్రజలు తమ వెంటే ఉన్నారని పార్టీ రాష్ట్ర చీఫ్ నైనార్ నాగేంద్ర ప్రకటించారు. ఆయనకు పీఏలుగా ఉన్న నలుగురిలో ఇద్దరు రాజీనామా చేసి బయటకు వచ్చారు. దీంతో బీజేపీ భారీ స్థాయిలో నష్టపోయే అవకాశం కనిపిస్తోంది. పార్టీ మాట ఎలా ఉన్నా.. స్థానికంగా ఇప్పుడిప్పుడే బలం పుంజుకుంటున్న బీజేపీకి, నాయకులకు ఈ పరిణామం కంటిపై కునుకు లేకుండా చేస్తుండడం గమనార్హం. ఈ పరిణామాలను బీజేపీ అగ్రనాయకత్వం నిశితంగా గమనిస్తోందని.. పార్టీలోనే అందరూ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని నాగేంద్ర తాజాగా మరోసారి ప్రకటించారు

# కిషన్ రెడ్డి నీ సంగతేంటో తెలుస్తా

**-రాజకీయాలు ఎన్నికల వరకే..**
**ఆపై అభివృద్ధే మా అజెండా**
**-నగరాల విభజన లబ్ది కోసం కాదు..**
**పాలనా సౌలభ్యం కోసమే**
**-కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి..**
**మెట్రో విస్తరణను అడ్డుకోవద్దు**
**-గుజరాత్, ఢిల్లీలో నదుల ప్రక్షాళన ఓకే..**
**మన మూసీకి అడ్డంకులా?**
**-జూన్ 15 లోపు అనుమతులు రాకుంటే..**
**బరాబర్ సంగతి తేలుస్తాం!**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి,
జీహెచ్ఎంసీని పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు కార్పొరేషన్లుగా విభజించామని, ఎన్నికల్లో లబ్ధికోసమే విభజించినట్లు వస్తోన్న ఆరోపణల్లో నిజం లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ భగాయత్ లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం ప్రసంగించారు. నగరంలో ప్రజలు ఏ పని కావాలన్నా ట్యాంక్ బండ్ వద్దకే వెళ్లాల్సి వస్తోందని, అంతదూరం వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే కార్పొరేషన్లను విభజించామన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం ఎన్ని నిధులు కావాలన్నా ప్రభుత్వం నుంచి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తాను ఎన్నికలున్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేస్తానని.. ఆ తర్వాత అభివృద్ధే అజెండాగా ముందుకు వెళ్తామన్నారు. మూసీ మురికి వల్లే ఉప్పల్ విలువ తగ్గిపోయిందని, దానివల్లే నల్గొండ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి మూసీని ప్రక్షాళన చేస్తామంటే.. అనేకమంది అడ్డుపడుతున్నారని దుయ్యబట్టారు.గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేశారని, యూపీలో గంగానదిని ప్రక్షాళన చేసినట్లు యోగి చెప్పుకున్నారని గుర్తుచేసిన సీఎం.. మూసీ ప్రక్షాళనకు మాత్రం అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫైరయ్యారు. మా మోడీ నదులను ప్రక్షాళన చేశారని గొప్పగా చెప్పుకుంటున్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళనపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే ఆర్ఆర్ఆర్ ఎందుకు ఆగుతుంది? ఎవరు ఆపుతున్నారని ప్రశ్నించారు. నగరంలో 122 కిలోమీటర్ల మేర మెట్రోను పొడిగించాలని తాను కాళ్లకు బలపం కట్టుకుని ఢిల్లీకి తిరుగుతుంటే.. రాష్ట్రంలో ఉన్న కేంద్రమంత్రి మాత్రం కాలికి కట్టెకట్టుకుని మెట్రో ప్రతిపాదనలను అడ్డుకున్నారని విమర్శించారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేదా అని నిలదీశారు.

మెట్రో విస్తరణ లేకపోవడం వల్ల హైదరాబాద్ మెట్రో స్థానం 9కి పడిపోయిందన్నారు. నగరంలో 1.34 కోట్లమందికి సదుపాయాలు కల్పించడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. హయత్ నగర్ వరకూ నగర జనాభా విస్తరించి ఉందన్న విషయం అందరికీ తెలుసని, అక్కడి వరకూ మెట్రోను విస్తరించాలన్న డిమాండ్ ఉందన్నారు. జూన్ 15వ తేదీ తర్వాత.. మెట్రో విస్తరణకి అనుమతులు, ఆర్ఆర్ఆర్ కు పర్మిషన్, రాష్ట్రంలో వడ్ల కొనుగోలు, మూసీ ప్రక్షాళనకు అనుమతులు రాకుంటే.. బరాబర్ కిషన్ రెడ్డి సంగతేంటో చూస్తామని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి హెచ్చరించారు. ఆ పార్టీలోనే ఉండి.. పక్క పార్టీవాళ్లకి సపోర్ట్ చేస్తారని సొంతపార్టీ వాళ్లే కిషన్ రెడ్డి గురించి చెప్తున్నారని సీఎం విమర్శించారు. బీజేపీలో ఉంటూ.. కేటీఆర్ తో మాట్లాడుతారని చెప్తున్నారన్నారు. ఎన్నికలున్నప్పుడు రాజకీయాలు చేద్దామని, మిగతా సమయంలో ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించి, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని కోరారు.

# దేశంలో పడిపోతున్న జననాల రేటు!..

**రీప్లేస్‌మెంట్ స్థాయి కంటే దిగువకు**
**-ప్రమాద ఘంటికలు మోగిస్తున్న కేంద్ర హోం శాఖ నివేదిక**
**-21 ఏండ్ల తర్వాత తీవ్రమైన క్షీణత**
**-50 కోట్ల వరకు జనాభా తగ్గే ప్రమాదం**



**న్యూఢిల్లీ**
దేశంలో సంతానోత్పత్తి రేటు(టీఎఫ్ఆర్) దశాబ్దాల్లో మొదటిసారిగా రీప్లేస్‌మెంట్ స్థాయి కంటే కిందికి పడిపోయింది. కేంద్ర హోం శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం ప్రచురించిన 'శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ స్టాటిస్టికల్ రిపోర్ట్ 2024' ప్రకారం.. దేశంలో సంతానోత్పత్తి రేటు క్షీణించింది. రాబోయే సంవత్సరాల్లో దేశ జనాభా పెరుగుతుందని భావిస్తున్నప్పటికీ సంతానోత్పత్తి స్థాయి మళ్లీ 2.15 కంటే పైకి పెరుగకపోతే, దాని వృద్ధిలో క్రమంగా క్షీణత కనిపిస్తుంది. భారతదేశ రీప్లేస్‌మెంట్ స్థాయి 2.1 బెంచ్‌మార్క్ కంటే కిందకు పడిపోయిందని నివేదిక పేర్కొన్నది. రీప్లేస్‌మెంట్ లెవల్ అంటే జనాభా పెరుగకుండా లేదా తగ్గకుండా ఒక తరం నుంచి మరో తరానికి తనను తాను పునఃస్థాపించుకోవడానికి ప్రతి మహిళ కలిగి ఉండాల్సిన పిల్లల సంఖ్య.

ఒక దేశం సంతానోత్పత్తి రేటు చాలా కాలం పాటు ఈ స్థాయి కంటే తక్కువగా ఉంటే జనాభా క్రమంగా క్షీణిస్తుంది. వాషింగ్టన్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్' నిపుణుల అంచనా ప్రకారం.. భారత జనాభా 21 ఏండ్లలో అత్యధిక స్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత తీవ్రమైన క్షీణత ప్రారంభమవుతుంది. శతాబ్దం చివరి నాటికి దేశ జనాభా ఒక బిలియన్(100 కోట్లు) కంటే కొంచెం ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. ఇది దాదాపు అర బిలియన్(50 కోట్లు) ప్రజల తగ్గుదలను సూచిస్తున్నది. దేశవ్యాప్తంగా కేవలం ఆరు రాష్ట్రాలు మాత్రమే ఈ రీప్లేస్‌మెంట్ మార్కు కంటే ఎక్కువ సంతానోత్పత్తి రేట్లను కలిగి ఉన్నాయి. ఢిల్లీ దేశంలోనే అత్యల్పంగా 1.2 టీఎఫ్ఆర్ నమోదు చేసింది. ఇది ఫిన్లాండ్(1.3 టీఎఫ్ఆర్) కంటే తక్కువని నివేదిక పేర్కొన్నది.

**సంతానోత్పత్తి రేటు ఎందుకు క్షీణిస్తున్నది?**
21వ శతాబ్దంలో కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించే అనేక అంశాలు ఉన్నాయి. ప్రస్తుత భారతీయ తల్లిదండ్రుల మారుతున్న ఆశయాలు దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గడానికి ముఖ్యమైన కారణాల్లో ఒకటి. పిల్లల విద్యావకాశాల కోసం, పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా చాలామంది ఆధునిక జంటలు ఒకే బిడ్డను ఎంచుకొంటున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిపోతుండడం, పట్టణీకరణ, ఉపాధి విధానాల్లో మార్పుల కారణంగా ప్రస్తుతం సుమారు 70 శాతం మంది ప్రజలు విడివిడిగా(న్యూక్లియర్ ఫ్యామిలీస్) నివసిస్తున్నారని ప్రభుత్వ గణాంకాలు చూపిస్తున్నాయి. ఫలితంగా పిల్లలను పెంచడం తల్లిదండ్రులపై ఎక్కువ ఒత్తిడి కలిగిస్తున్నది. ఇది తక్కువ మంది పిల్లలను కలిగి ఉండేలా వారిని ప్రోత్సహిస్తున్నది. టీఎఫ్ఆర్ స్థాయి తగ్గడానికి మరొక ముఖ్యమైన కారణం సాంస్కృతిక మార్పు. గ్రామీణ ప్రాంతాల్లో కేబుల్ టెలివిజన్ రాక వల్ల కొన్నేండ్లుగా గర్భధారణలు తగ్గుముఖం పట్టాయని నివేదిక పేర్కొన్నది. చిన్న కుటుంబాలను ప్రోత్సహించే మహిళలను చూపే టెలివిజన్ ధారావాహికలతో సంతానోత్పత్తి రేటు క్షీణత ముడిపడి ఉన్నదని నిపుణులు అంటున్నారు. ఈ జనాభా మార్పు విభిన్న సామాజిక సవాళ్లను తెచ్చిపెడుతుంది. కాలక్రమేణా, నిరంతర తక్కువ సంతానోత్పత్తి రేటుతో వృద్ధుల సంఖ్య ఎక్కువవుతుంది, శ్రామిక శక్తి తగ్గుతుంది. సామాజిక సంక్షేమ వ్యవస్థలపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. భారత్‌లో పరిస్థితిపై టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో అత్యంత విద్యావంతులైన వారిలో జననాల రేటు చాలా ఏండ్ల క్రితమే రీప్లేస్‌మెంట్ కంటే కిందికి పడిపోయిందని పేర్కొన్నారు.

# బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

బీసీ సంక్షేమ హాస్టళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు. హాస్టళ్ల ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు అందించాల్సిన మెనూ అమలు తీరు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, షూస్ తదితర అవసరమైన సామగ్రి పంపిణీ విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా బీసీ గురుకులాలు, బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో 500కు పైగా మార్కులు సాధించే విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే బీసీ గురుకులాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థుల సంఖ్య పెంపుపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల సమగ్ర వికాసం కోసం హాస్టళ్లలో క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఏడాది పొడవునా నిర్వహించాల్సిన విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలతో కూడిన అకాడమిక్ ప్రొఫైల్ రూపొందించాలని సూచించారు. హాస్టళ్ల పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి పేర్కొన్నారు. రాబోయే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించాలని సూచించారు. ఫౌండేషన్ కోర్సులు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా బీసీ స్టడీ సర్కిల్స్ లో సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల కోసం దీర్ఘకాలిక శిక్షణ కార్యక్రమాలు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకలైన ఆత్మగౌరవ భవనాల పురోగతిపై కూడా చర్చ జరిగింది. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బూర వెంకటేశం, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ ఆలోక్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వడ్డెర ఫెడరేషన్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దార్శనిక దేవాలయాలుగా
# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు

మొదటి తరువాయి

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలోని భవన సముదాయాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాలినడకన తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్ విభాగాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వేదికలుగా నిలిచే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పనులను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను (కాంట్రాక్టర్లను) ఆదేశించారు. విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి.. కేవలం వ్యయం కాదు, అది రాబోయే భవిష్యత్ తరాలను శక్తివంతంగా నిర్మించడం కోసం పెట్టే అద్భుతమైన పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లక్ష్మీపురం స్కూల్ ఆవరణ అంతా తిరుగుతూ పనుల ప్రగతిని స్వయంగా అంచనా వేసిన డిప్యూటీ సీఎం, సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్, మెకానికల్ ల్యాబ్ భవనాల నిర్మాణ నాణ్యతపై అధికారులకు కీలక సూచనలు. గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులకు డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు.

# తెలంగాణ హక్కులు ఏపీకి తాకట్టు

మొదటి తరువాయి

దీని వల్ల అత్యధికంగా పాలమూరు జిల్లాకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "పాలమూరుకు కేటాయించిన 90 టీఎంసీల్లో 45 మైనర్ ఇరిగేషన్, 45 డైవర్షన్ లో వచ్చేవి. పాతవి 811, కొత్తగా బ్రిజేష్ ట్రిబ్యునల్ చెప్పిన 194 కలిపితే 1005 టీఎంసీలు పున:పంపిణీ కింద సంక్రమిస్తాయి. అలాగే మరో45 టీఎంసీల నీటిని తెలంగాణకు ఇచ్చే విషయం ట్రిబ్యునల్ తేల్చబోతున్నది. మొత్తంగా 1050లో కనిష్టంగా 700 టీఎంసీలు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి మాత్రం 90 టీఎంసీలకు ఎన్ఓసీ ఇవ్వండి అన్ని నీళ్లు విడిచిపెట్టుకుంటం అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరగనుంది" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరిలో కేటాయించిన 968 టిఎంసీలు, కృష్ణాలో రానున్న 1050 టీఎంసీల నీటికి సంబంధించిన ప్రాజెక్టుల క్లియరెన్స్ పూర్తయిన తర్వాతనే నదుల అనుసంధానం ప్రక్రియ గురించి మాట్లాడాలన్నారు. గతంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో తాము కావేరి అనుసంధానానికి అనుకూలమనీ, అయితే ఇచ్చంపల్లి లేదా, సమ్మక్క బ్యారేజీ ద్వారా తరలించాడానికి మాత్రమే ఒప్పుకున్నామని చెప్పారు. ఇంటర్ లింకేజిలో నీటిని తరలించే క్రమంలో స్థానిక రాష్ట్రానికి 50 శాతం వాటా ఉంటుందనీ, దాన్ని తెలంగాణకు ఇవ్వకుండా ఉండేందుకు పోలవరం నుంచి నేరుగా తరలించే కుట్రకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. కావేరి అనుసంధానంపై బీజేపీ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రం గుండా పోతే రూ.48వేల కోట్లు, పోలవరం బనకచర్ల ద్వారా అయితే రూ.82వేల కోట్లు ప్రాజెక్ట్‌కు ఖర్చు అవుతుందన్నారు. ఖర్చు, నిర్వహణ ఎక్కువ అయినా కేంద్రం ఏపీ ప్రయోజనాల కోసమే మొగ్గు చూపుతున్నా తెలంగాణకు చెందిన బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు పోరాడాలని సూచించారు. పోలవరం కావేరీ లింక్‌ను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో ధర్నాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల పక్ష?ం ఏర్పాటు చేయడంతో పాటు అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని సూచించారు. ఏపీ నీటి దోపిడిపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

# సంపాదకీయం

## సంస్కృతిపై బీచ్ షాక్స్ దాడి



ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యం మంచిదే. ఉపాధి అవకాశాలు పెరగాలి, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి, రాష్ట్రానికి ఆదాయం రావాలి. ఈ లక్ష్యాలను ఎవరూ వ్యతిరేకించరు. కానీ అభివృద్ధి పేరుతో సమాజం చెల్లించాల్సిన మూల్యం ఎంత? అనేది కూడా అంతే ముఖ్యమైన ప్రశ్నే. విశాఖపట్నం, చీరాల వంటి సముద్ర తీర ప్రాంతాల్లో గోవా తరహా పర్యాటక వినోదాన్ని అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వినసొంపుగా ఉన్నప్పటికీ, దీని వెనుక ఉన్న సామాజిక పర్యవసానాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మద్యం విక్రయాలకు అనుమతులతో కూడిన ఈ విధానం తెలుగు సంస్కృతిని, కుటుంబ వ్యవస్థను ఏ తీరాలకు చేరుస్తుందోనన్న ఆవేదన మేధావుల్లోనూ, మహిళాలోకంలోనూ వ్యక్తమవుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడానికి ప్రభుత్వం ఎంచుకుంటున్న మార్గాలు కేవలం మద్యం, విలాసాల చుట్టూ తిరగడం శోచనీయం. పర్యాటక అభివృద్ధి అంటే కేవలం విదేశీ లేదా పాశ్చాత్య ధోరణులను దిగుమతి చేసుకోవడం కాదు. పర్యాటకం అనేది ఒక ప్రాంతం యొక్క వారసత్వాన్ని, సహజ సౌందర్యాన్ని గౌరవప్రదంగా ప్రదర్శించేదిగా ఉండాలి. 'మన మధ్య వేలాది మంది తాగుబోతులు ఉండటం కంటే, భారతదేశం నిరుపేద స్థితికి పడిపోవడమే మేలని నేను భావిస్తాను. దేశాన్ని మద్యపాన రహితంగా మార్చడానికి విద్యను వదులుకోవాల్సి వస్తే, విద్య లేని భారతదేశాన్నే నేను కోరుకుంటాను (యంగ్ ఇండియా, 15-9-'27)- అంటారు గాంధీజీ. మద్యం ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర ఖజానాను ఎంత నింపుతుందోగానీ, సామాన్య ప్రజల ఇళ్లలో మాత్రం అంతకంటే ఎక్కువ చీకటిని నింపుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ వల్ల విచ్చలవిడితనం పెరిగిందనే విమర్శలు ఉండగా, ఇప్పుడు నేరుగా సముద్ర తీరాలనే 'బార్'లుగా మార్చడం ప్రజాహిత నిర్ణయం అనిపించుకోదు.

తెలుగు జాతికి ఒక ఘనమైన చరిత్ర, సంస్కృతి ఉన్నాయి. మన సముద్ర తీరాలు కుటుంబ సమేతంగా వెళ్లి ప్రశాంతంగా గడిపే పుణ్యక్షేత్రాల వంటివి. ఇప్పుడు ఆ తీరాలలో 'బీచ్ షాక్స్- ఏర్పాటు చేసి, అక్కడ మద్యం పారుతుంటే.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలు, మహిళలు, పిల్లలు అక్కడికి వెళ్లగలరా? పాశ్చాత్య దేశాల్లోని 'క్లబ్ కల్చర్'ను మన తీరాలకు అద్దడం వల్ల మనం పొందే లాభం కంటే కోల్పోయే సాంస్కృతిక విలువలే ఎక్కువ. సంస్కృతి అంటే కేవలం పండుగలు, సంప్రదాయాలు మాత్రమే కాదు; సమాజం అనుసరించే విలువలు, జీవన విధానం కూడా. ఆ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ప్రభుత్వం చెబుతున్నట్లుగా గోవా మోడల్‌ను అనుసరించడం వల్ల పర్యాటకులు పెరిగే అవకాశముండవచ్చు. కానీ ప్రతి ప్రాంతానికి తనదైన చరిత్ర, సంస్కృతి, సామాజిక నిర్మాణం ఉంటాయి. 'సంస్కృతి అంటే మనం ఏమిటో తెలిపేది, నాగరికత అంటే మన దగ్గర ఏముందో తెలిపేది. నాగరికత కోసం సంస్కృతిని బలి ఇవ్వకూడదు- అంటారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. గోవాలో పర్యాటకం బాగుండవచ్చు, కానీ అక్కడ పెరుగుతున్న మాదక ద్రవ్యాల సంస్కృతి, నేరాలు, అనైతిక కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్ ఆహ్వానించాలనుకుంటోందా? 'ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు బీచ్ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు సాగిస్తే మహిళలు, విద్యార్థినులు, కుటుంబాలు విశాఖ బీచ్ రోడ్డుపై స్వేచ్ఛగా సంచరించే పరిస్థితి ఉంటుందా- అని మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. బీచ్ షాక్స్ వల్ల మహిళల భద్రతను, స్వేచ్ఛను తాకట్టు పెట్టడం సిగ్గుచేటని, ఈవ్ టీజింగ్, వేధింపులు పెరిగే అవకాశం ఉందని వారు మండిపడుతున్నారు. సనాతన ధర్మం గురించి గగ్గోలు పెట్టే పవన్ కల్యాణ్, హిందూ సంస్కృతి అంటూ నిత్యం మాట్లాడే బిజెపి ఈ విధానాన్ని బలపరచడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనం.ఆంధ్రప్రదేశ్‌కు విశాలమైన తీరప్రాంతం ఉంది. బీచ్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలంటే పర్యావరణహిత రిసార్టులు, కుటుంబ విహార కేంద్రాలు, జలక్రీడలు, అడ్వెంచర్ టూరిజం, స్థానిక కళలు-- సంస్కృతిని ప్రతిబింబించే పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటు చేయవచ్చు. తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి స్థానిక హస్తకళలు, సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికలు కల్పించాలి. ఉపాధి లభిస్తుంది, సంస్కృతి కాపాడబడుతుంది. భవిష్యత్ తరానికి మనం అందమైన ప్రకృతిని, గౌరవప్రదమైన జీవన విధానాన్ని అందించాలి. కానీ, సముద్రపు గాలిలో మద్యం వాసనను, ఇసుక తిన్నెలపై ఖాళీ సీసాలను పరిచయం చేయడం నాగరికత అనిపించుకోదు. ఈ విచ్చలవిడి సంస్కృతి రేపటి సమాజ విచ్ఛిన్నానికి పునాదిగా మారకూడదు. ప్రజాస్వామ్యంలో అభివృద్ధి అనేది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలి. మెజారిటీ ప్రజలు, ముఖ్యంగా మహిళలు వ్యతిరేకిస్తున్న 'బీచ్ షాక్' విధానాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలి. ఆదాయం కంటే సామాజిక ఆరోగ్యం ముఖ్యం. సంప్రదాయాలను కాలరాసి సాధించే ఏ అభివృద్ధీ శాశ్వతం కాదు.

## జైపూర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత..

**- రెండు రోజులపాటు మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవలు బంద్**




**న్యూఢిల్లీ, -07జూన్ (మహాప్రభ,)**
రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో అధికారులు అక్రమ కట్టడాల్ని కూల్చివేస్తున్నారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ(జేడీఏ) అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా డివిజనల్ ఆఫీసర్ వి శరవణ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు.రెండు రోజులపాటు జైపూర్ పరిధిలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలు, ఎస్ఎంఎస్ సేవలు నిలిపివేయనున్నారు. జూన్ 7 అర్ధరాత్రి 12 గంటల నుంచి జూన్ 8 అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ సేవలు నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణ, అల్లర్లకు తావు లేకుండా ఉండాలని ప్రభుత్వ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.2జీ, 3జీ, 4జీ, 5జీ మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్, ఎంఎంఎస్ సేవలు నిలిచిపోనున్నాయి.ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్ వంటి సోషల్ మీడియా సర్వీసులు కూడా ఆగిపోతాయి. అసత్య ప్రచారాలు, తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే అంశాలు వంటివి ప్రచారం కాకుండా ఉండటానికి తాత్కాలికంగా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు.జైపూర్ నగరంలోని అనేక పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నిషేధం అమలవుతోంది. సస్పెన్షన్ ఆఫ్ టెలికాం సర్వీసెస్ (పబ్లిక్ ఎమర్జెన్సీ ఆఫ్ పబ్లిక్ సేఫ్టీ) రూల్స్ 2017 ప్రకారం ఈ రూల్ అమలు చేస్తున్నారు. దీనిద్వారా ప్రజా సంక్షేమం కోసం ఈ సేవల్ని తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉంది. తాత్కాలిక సేవల నిలిపివేతకు అనుగుణంగా ప్రజలు ప్లాన్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.

## ఇది ట్రైలర్ మాత్రమే!..

**-లేకుంటే ఆందోళనలు ఉధృతం: అభిజీత్ దీప్కే**

**-వారంలోగా మంత్రి ప్రధాన్ దిగిపోవాల్సిందే**



**న్యూఢిల్లీ, -07జూన్ (మహాప్రభ,)**
: కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా, ఇతర డిమాండ్లతో శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తాము నిర్వహించిన ఆందోళన కేవలం ట్రైలర్ మాత్రమేనని, మంత్రి దిగేపోయే వరకు ఆందోళన కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. సీజేపీ ఆధ్వర్యంలో తొలిసారిగా జరిగిన నిరసనకు పెద్దయెత్తున తరలి వచ్చిన తల్లిదండ్రులు, వారి పిల్లలు, ఆందోళనకారులు, విద్యార్థులు, నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'నిన్నటి ఆందోళనకు వేలాది మంది హాజరై చరిత్ర సృష్టించారు. ఐక్యంగా ఉంటే బొద్దింకలు ఏమన్నా చేయగలవని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన ద్వారా ప్రభుత్వానికి ఒక ట్రైలర్ చూపించాం' అని ఆయన ట్వీట్ చేశారు.అంతకుముందు ఏ ఆందోళనలో పాల్గొనని వారు సైతం జంతర్‌మంతర్‌లో తాము జరిపిన ఆందోళనలో భాగస్వాములయ్యారని ఆయన చెప్పారు. విద్యా వ్యవస్థపై ఉన్న అసహనాన్ని, కోపాన్ని తెలియజేసేందుకు సామూహిక ఉనికితో ఇందులో పాల్గొన్నారని చెప్పారు. మన గళాలు విన్పించకపోతే మార్పు సాధ్యం కాదన్నారు. శాంతియుతంగా చేసే ఉద్యమాన్ని ప్రభుత్వం తాకలేదన్నారు. మాలాంటి బొద్దింకలకు వారంటే భయపడాల్సిన అవసరం ఎప్పుడూ లేదన్నారు. 'మన ఉద్యమం ఇక్కడితో ఆగిపోదు. ఒక తరాన్ని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుదోవ పట్టించారు. వచ్చే వారంలోగా ఆయనను తొలగించకున్నా లేదా దిగిపోకున్నా మా నిరసనను క్షేత్ర స్థాయిలో కొనసాగిస్తాం' అని దీప్కే హెచ్చరించారు.

## భూటాన్‌లో 5.6 తీవ్రతతో భూకంపం..

**ఈశాన్య భారత్ సహా నేపాల్, చైనా, బంగ్లాదేశ్‌లలో ప్రకంపణలు**



**న్యూఢిల్లీ, -07జూన్ (మహాప్రభ,)**
భూటాన్‌లో ఆదివారం రాత్రి సమయంలో భూకంపం సంభవించింది. 5.6 తీవ్రతతో ఈ భూకంపం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూకంప ప్రభావం భూటాన్, ఇండియాతోపాటు బంగ్లాదేశ్, నేపాల్, చైనాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపించింది. ఈ విషయాన్ని జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ (జీఎఫ్‌జడ్) వెల్లడించింది. ఇండియాలోని అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో ఈ ప్రభావం కనిపించింది.ఇండియాకు సంబంధించి అసోంకు 252 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. రాత్రి 11.06 నిమిషాల సమయంలో భూటాన్‌లోని పునాఖా ప్రాంతంలో ఈ భూకంపం వచ్చింది. అక్కడ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారికి ఈ అలర్ట్ కూడా జారీ అయింది. భూటాన్‌లోని పునాఖా ప్రాంతంలోని పది కిలోమీటర్ల పరిధిలో భూకంపం సంభవించింది. అక్కడ ఇండ్లు వణకడం గుర్తించిన ప్రజలు ఇండ్లను వదిలి బయటకు వచ్చేశారు. అసోం, మేఘాలయతోపాటు హిమాలయ పర్వత ప్రాంతంలో ప్రజలు భూకంప తీవ్రతను అనుభవించారు. భూకంప భయంతో స్తానికులు ఇండ్లు వదిలి బయటే ఉంటున్నారు. భూటాన్ హిమాలయ భూకంప పరిదిలో ఉండటం వల్ల ఆ దేశంలో కూడా దీని ప్రభావం ఉంటుంది. ఇండియన్, యురోనేషియన్ టెక్టోనిక్ పలకలు ఢీకొనడం వల్ల భూకంపాలు సంభవించే అవకాశం ఉంది. అందువల్లే తరచూ హిమాలయాల సమీపంలో భూకంపాలు సంభవిస్తుంటాయి. ఇలాంటి సమయంలో ప్రజలు అనవసరంగా ఆందోళనకు గురవ్వడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. భూకంపాలు సంభవిస్తే ముందుగా ప్రశాంతంగా వ్యవహరించడం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటప్పుడు దీన్నుంచి ఎలా బయటపడగలమనే విషయాన్ని ఆలోచించగలుగుతాడు. అలాగే, భయంతో పరుగెత్తడం వల్ల కూడా ప్రమాదాలు జరిగి గాయపడొచ్చు.

---

## జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**-సత్వర న్యాయ పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక**


**-: ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్.**



**మెదక్ జిల్లా -07జూన్ (మహాప్రభ )**
ప్రజలకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో న్యాయం అందించేందుకు నిర్వహించబడుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను మెదక్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ వివాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.
లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమైతే దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభించడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా ముగించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ప్రజలు తమ కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని ఎస్పీ కోరారు. సామరస్య పరిష్కారమే శాశ్వత పరిష్కారమన్నారు.

---

## 4 లగ్జరీ ఇండ్లు, 13 ప్లాట్లు, రూ.2 కోట్ల నగదు



**భువనేశ్వర్: -07జూన్ (మహాప్రభ,)**
నెలకు రూ. 6 వేల జీతంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని ప్రారంభించిన ఒడిశాకు చెందిన వైకుంఠనాథ్ బెహరా అక్రమాస్తుల్ని చూసి అధికారులు అవాక్కయ్యారు. కందమాల్ జిల్లాలోని బలిగూడలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ)లో అసిస్టెంట్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఆయనపై పలు అవితీని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, భువనేశ్వర్‌లోని ప్రత్యేక న్యాయమూర్తి(విజిలెన్స్) సెర్చ్ వారెంట్ జారీ చేశారు.విజిలెన్స్ అధికారులు తొమ్మిది ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేశారు. ఈ తనిఖీల్లో అధికారులు ఐదు బహుళ అంతస్థుల భవనాలు, 13 స్థలాలు, బంగారు ఆభరణాలు, బ్యాంకు లాకర్ల నుంచి రూ.రెండు కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల విలువ కొన్ని కోట్లు ఉంటుందని, ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఇంత భారీ మొత్తం స్వాధీనం చేసుకోవడం ఇదేనని అధికారులు తెలిపారు.

## స్పీడ్ అప్ గా ధాన్యం కొనుగోలు

**-జిల్లా వ్యాప్తంగా 81,266 మంది రైతుల నుంచి 3,75,471,120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 62,363 మంది రైతులకు 664,67 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి**

**-జిల్లావ్యాప్తంగా 260 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**

**--జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -07జూన్ (మహాప్రభ,)**
మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు స్పీడ్ అప్ గా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లా వ్యాప్తంగా 81,266 మంది రైతుల నుంచి 3,75,471,120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 62,363 మంది రైతులకు 664,67 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి చేశామని, జిల్లావ్యాప్తంగా 260 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు తెలిపారు. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడోద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదివారము ఒక ప్రకటనలో తెలిపారు.

# 20వ మహాసభలను జయ ప్రదం చేయండి



**దేవరకొండ జూన్ 7 ( మహా ప్రభ)**
కొండ మల్లేపల్లి.. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 20 వ మహాసభలు జూన్ 12 న తిప్పర్తి మండలం ఆవిశెట్టి దుప్పలపల్లి కె ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరుగు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ పిలిపించారు కొండ మల్లేపల్లి మండలం కొలుముంతలపాడు గ్రామంలో సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ ఈ మహాసభలో వ్యవసాయ కార్మికుల ఉపాధి కూలీల ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి జి రామ్ జి ఉపాధి హామీ కూలీలకు నష్టం చేసే చట్టాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్తు కార్యక్రమాలు తీసుకొని ఐక్య ఉద్యమాలకు కార్యచరణ ఈ మహాసభలో తీసుకోవడం జరుగుతుంది ఇతర అనేక సమస్యలపై పోరాటానికి ఈ మహాసభ ఉపయోగపడునట్లు తెలిపారు ఈ మహాసభకు వ్యవసాయ కూలీలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మొగిల శ్రీనివాస్ సంఘం నాయకులు వాస్కుల యాదయ్య ఎన్ బాలనారి పార్వతమ్మ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# అశోక్ రాథోడ్ మాతృ మూర్తి మృతి చాలా బాధాకరం

**- బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావ త్ బిల్యా నాయక్**



**దేవరకొండ డివిజన్ జూన్ 7 ( మహాప్రభ )**
నెరడుగొమ్ము మండలం లోని చర్ల తండా గ్రామానికి చెందిన గిరిజన సంఘం రాష్ట్ర బి ఆర్ ఎస్ అధ్యక్షుడు అశోక్ రాథోడ్ గారి మాతృ మూర్తి మృతి చాలా బాధాకరం అని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అన్నారు. ఆదివారం అశోక్ రాథోడ్ మాతృ మూర్తి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు

# ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ నిరసన



**హుస్నాబాద్, జూన్ 7 ( మహాప్రభ )**
పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పెరుగుతున్న ఇంధన ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని ఆరోపిస్తూ నాయకులు రోడ్డుపై వంట పొయ్యి ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యులకు అందని ద్రాక్షలా మారాయని, మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు. ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ నిరసన బలంగా వినిపించింది.

# కుమ్మరుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతిపత్రం.





**ఎల్ బి నగర్ 7 జూన్ (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ ప్రతినిధుల భేటీ తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి కుమ్మరుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు క్రింది డిమాండ్లను మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు: కుమ్మర ఆత్మ భవన్ ట్రస్ట్ నిర్మాణం మరియు అభివృద్ధి కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర తొలి బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కుమ్మరుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. లక్ష్మీనారాయణ, టి.కె. శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామన్ కోల్ వీరేశం, వృత్తి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గుండాల గోవర్ధన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు కమ్మంపాటి సత్యనారాయణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు అగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్, రామన్ కోల్ ప్రభాకర్, నడికుడ అశోక్, ఆమంచి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్ల సమావేశం



**అమ్రాబాద్, జూన్ 7 ( మహాప్రభ )**
నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లలో, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు అచ్చంపేటలో సమావేశమై తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 64 ప్రకారం ఇప్పటికీ రూ. 11,700 మాత్రమే చెల్లించడం అన్యాయమని, ఇతర జిల్లాల్లో కలెక్టర్ ప్రకారం రూ. 26,700 వేతనం ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. సమాన వేతనం ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.జూన్ 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు అందరూ తరలి రావాలని వర్గాలు పిలుపునిచ్చాయి.సమాన వేతనం కోసం డైలీ వేజ్ వర్కర్లు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

# విద్యుత్ శాఖ తక్షణ చర్యలపై స్థానికుల ప్రశంసలు



**రామగుండం, జూన్ 7 ( మహాప్రభ )**
: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ అశోక్‌నగర్ వాటర్ ట్యాంక్ వద్ద చాలా కాలంగా విద్యుత్ వైర్లు క్రిందకు వేలాడుతూ ఉండటంతో ప్రజలకు, వాహనదారులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.ఈ సమస్యను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం అయినప్పటికీ టీజీఎన్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో చర్యలు చేపట్టి, కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను ఎత్తులో అమర్చి సమస్యను పరిష్కరించారు. ప్రజల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారంలో కృషి చేసిన ఈస్ట్ ఏ.ఈ. జమీల్, లైన్మెన్ ప్రశాంత్, సిబ్బందిని 50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ అభినందించారు. ప్రజల భద్రత కోసం విద్యుత్ శాఖ తక్షణ చర్యలు తీసుకోవడం స్థానికుల ప్రశంసలు పొందింది.

## పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నేత వద్య రమేష్



**దేవరకొండ డివిజన్ జూన్ 07 ( మహాప్రభ)**
కొండ మల్లేపల్లి మండలం పెండ్లి పాకాల కు చెందిన బీమనబోయిన మల్లయ్య యాదవ్ - మాధవి గార్ల కుమారులు నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో కొండ మల్లేపల్లి లోని విజయ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు అజ్మపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ, పెండ్లి పాకాల బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాంబాబు యాదవ్,తదితరులు పాల్గొన్నారు.....

# నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం:

**-పాల్గొన్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, ఇస్లావత్ అభిషేక్ నాయక్**



**దేవరకొండ జూన్ 7 ( మహాప్రభ )**
కొండమల్లెపల్లి మండలం పెండ్లిపాకుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు భీమనబోయిన యల్లయ్య యాదవ్- మాధవి దంపతుల కుమారులు అర్జున్ - ఉమేష్ ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం కొండమల్లెపల్లి పట్టణంలోని విజయలక్ష్మి పంక్షన్ లో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కు బోజన సదుపాయం కల్పించిన బిఆర్ఎస్

**- దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్**




**దేవరకొండ జూన్ 7 ( మహాప్రభ )**
సోమవారం జరగబోయే శ్రీ అండపల్లి జలంధర్ రెడ్డి డి సి సి స్టేట్ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఫైనల్ మ్యాచ్ రోజున క్రీడాకారులకు మరియు ప్రేక్షకులకు బోజన సదుపాయం కోసం బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ 10000/- రూపాయల సదుపాయం అందించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు పీర్ మొహమ్మద్, మహమ్మద్ బాసిత్, చంద్రయ్య, హుసేని తదితరులు పాల్గొన్నారు...

# నూతన సీఐ సత్యనారాయణకు ఎంఐఎం నేతల ఘన సన్మానం

**ఖానాపూర్,జూన్ 7 ( మహాప్రభ )**
ఖానాపూర్ పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో నూతన సీఐ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని వారు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని సీఐ సత్యనారాయణను కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జనరల్ సెక్రటరీ అప్సర్, నాయకులు కైఫ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.సీఐ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించడంతో పట్టణంలో కొత్త ఉత్సాహం నెలకొంది.



# యువత స్వయం ఉపాధితో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలి

**–డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి**



**ఆమనగల్లు,జూన్ 7 ( మహాప్రభ )**
యువత స్వయం ఉపాధితో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. యువత ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి భవిష్యత్ మరింత బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో సురేష్, మూడ రవి ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్ మరియు టీ స్టాల్ ఫాస్ట్ ఫుడ్ లను వేరువేరుగా సర్పంచ్ రాయకంటీ బిక్షపతి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. స్వయం ఉపాధి ద్వారా తమకే కాకుండా గ్రామం, సమాజానికి ఉపాధి అవకాశాలు సృష్టించే స్థాయికి యువత ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అందుబాటులో ఉన్న రుణ సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని యువత తమ జీవితాలను మార్చుకోవాలని పిలుపునిచ్చారు. చేసే వృత్తిని దైవంగా భావించి కష్టపడి పనిచేస్తే ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలకు ప్రభుత్వం నుండి సహకారం అందుబాటులో ఉన్నదని, యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పరమేష్, జహంగీర్ బాబా, భాను కిరణ్, మంకీ మహేష్, ముత్తి కృష్ణ , రమేష్, మంగళపల్లి నరసింహ, లాయక్ అలీ, కొప్పు కృష్ణ, గురిగల్ల రాంచంద్రయ్య, క్యామ వెంకటేష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజేంద్ర గౌడ్, ఇమ్రాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**మర్రిగూడ, జూన్ 7 ( మహాప్రభ )**
మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవసారి ఏర్పాటు చేసిన 14వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి వచ్చిన మహిళలు, వృద్ధులను ఆత్మీయంగా పలకరించి వారి కుటుంబ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. “కంటి ఆపరేషన్ చేయించుకోవడానికి భయపడాల్సిన అవసరం లేదు. ఆపరేషన్ తర్వాత చూపు మెరుగుపడుతుంది. అవసరం లేని వారికి కళ్ళజోళ్ళు అందిస్తాం” అని ధైర్యం చెప్పారు. ఇప్పటి వరకు ఫౌండేషన్ ద్వారా 9,766 మందికి కంటి పరీక్షలు, 2,198 మందికి ఆపరేషన్లు, 4,227 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. “ముందు ముందు ఇంకా వేలమందికి ఆపరేషన్లు చేయిస్తాం. ఎవరూ భయపడవద్దు” అని భరోసా ఇచ్చారు. వచ్చిన ప్రతి ఒక్కరికి భోజన సదుపాయం కల్పించి, స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, ఆదివాసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీను నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ పగడాల లింగయ్య, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు లప్పంగి నరసింహ, మర్రిగూడ సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్, కొడాల వెంకటరెడ్డి, సిరిసవాడ బిక్షం, వెనమనేని రవీందర్ రావు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మెండు దీపికా రెడ్డి, అంజమ్మ, సిరిపంగి శ్రీనివాస్తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృగశిర కార్తె సందడి..

**-పానగల్ రోడ్డుపై చేపల కొనుగోళ్ల జోరు**



**నల్లగొండ**
**జూన్ 7 ( మహాప్రభ )**
నల్గొండ పట్టణంలోని పానగల్ రోడ్డు పై మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం ఒకరోజు ముందుగానే సందడి నెలకొంది. చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదనే సంప్రదాయ విశ్వాసంతో ప్రజలు భారీ సంఖ్యలో చేపల మార్కెట్లకు తరలివచ్చి కొనుగోళ్లు చేపట్టారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ప్రజలు వివిధ రకాల చేపలను కొనుగోలు చేస్తూ మార్కెట్ ప్రాంతాన్ని కిటకిటలాడేలా చేశారు. మృగశిర కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయనే నమ్మకం తెలంగాణలో చాలాకాలంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చేపల వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి వినియోగదారులకు చేపలను విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మృగశిర కార్తె సందర్భంగా చేపల కొనుగోళ్లు పెరుగుతుండగా, నల్గొండలో కూడా అదే ఉత్సాహం కనిపిస్తోంది. చేపల మార్కెట్లలో రద్దీ పెరగడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, మృగశిర కార్తె వేడుకలకు నల్గొండ ప్రజలు సిద్ధమవుతున్నారు. పానగల్ రోడ్డంతా కొనుగోలుదారులతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ.



**జగిత్యాల జూన్ 7 ( మహాప్రభ )**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి లో జువ్వాడి నర్సింగ రావు రజిని దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేశ్వర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సల్ల పురుషోత్తం,మహేందర్,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాయినీ సురేష్ మరియు షేక్ మమ్మద్ రోగులకు పండ్లను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# గోశాలలో సత్యనారాయణ వ్రతం



**జహీరాబాద్, జూన్ 7 ( మహాప్రభ )**
జహీరాబాద్ మండలం కొత్తూరు గ్రామ శివారులోని శ్రీ సిద్దేశ్వర గోశాలలో ఆదివారం నాడు స్థానిక పారిశ్రామిక వేత్త భగవాన్ జాదవ్ కుటుంబం సత్యనారాయణ వ్రత పూజా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పురోహితులు వేణు పంతులు సత్యనారాయణ పూజా కార్యక్రమం క్రతువును నిర్వహించగా భగవాన్ జాదవ్ సతీమణి ఉమా జాదవ్, వినాయక్ జాదవ్, దివ్య జాదవ్, లక్ష్మి వెంకటేష్ జాదవ్, ఆకాంక్ష జాదవ్, లక్ష్మి బాయి, రాణా ప్రతాప్, స్మిత, మోహన్ రెడ్డి, సంగీత రెడ్డి, మానస రెడ్డి, గణేష్, పల్లె ప్రవీణ్, గొల్ల బస్వరాజ్, చౌక్కారం సంగమేశ్వర్, రతన్ సార్డా, వందన సార్డా, ఎన్నం రఘు, మహేందర్ గోడకే, అనీల్ సార్డాతదితరులు పాల్గొన్నారు.

# గుండ్రాతి పద్మమ్మ కి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**గోపాల్ పేట్ జూన్ 7 ( మహాప్రభ )**
గోపాల్ పేట్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు గుండ్రాతి రాజేష్ గౌడ్ మాతృమూర్తి పద్మమ్మ గత కొన్ని రోజుల క్రితం పరమపదించారు. ఆదివారం గుండ్రాతి పద్మమ్మ దశదిన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా బిఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ లు పద్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి పద్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజేష్ గౌడ్, మన్యం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత




**కరీంనగర్ రూరల్, జూన్ 7 ( మహాప్రభ )**
బొమ్మకల్ వద్ద తన ఒప్పో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న నేరెళ్ల ఆంజనేయులు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను ట్రేస్ చేసి పెద్దపల్లి వద్ద స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫోన్‌ను యజమాని ఆంజనేయులకు ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి అందజేశారు. ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం సభ్యులు కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి, సుప్రియలను సి.ఐ. నిరంజన్ రెడ్డి అభినందించారు. సాంకేతిక వినియోగంతో ప్రజల విశ్వాసాన్ని పెంచుతున్న కరీంనగర్ పోలీసులు.

# ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ



**కరీంనగర్, జూన్ 7 ( మహాప్రభ )**
చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ ఘనంగా జరిగింది. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ఉద్యమకారులు పోరాటం చేసినప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా భూముల వ్యాపారంలో నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నది కేవలం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మాత్రమేనని ఆయన అన్నారు. కవిత నాయకత్వంలోనే రాష్ట్రంలో మహిళల స్థితి మారుతుందని, ఆమె ప్రవేశపెట్టిన పాంచజన్యం దేశ రాజకీయాల్లో విప్లవాత్మక నిర్ణయమని, రైతులు, మహిళలు, యువకులు, ఉద్యమకారులు, బడుగు బలహీన వర్గాలు కవిత అడుగులో అడుగేసి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాకల తిరుపతి, గుండేటి తిరుపతి, పిట్టల సత్యం, యండి బషిర్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, మల్లారెడ్డి, చంటి శ్రీనివాస్, సిపెల్లి వెంకటేష్, గాలిపెల్లి రత్నాకరచారి, లింగంపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి తిరుపతి, యండి రాజీ, పుసాల పవన్, నునే చరణ్, పల్లె శారద, అంజలి, అపర్ణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. జెండా పండుగలో కవిత నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

# 100శాంతం ధాన్యం కొనుగోలు పూర్తి



**కొండపాక, జూన్ 7 ( మహాప్రభ )**
తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని ఐకెపి సెంటర్‌లో రైతుల ధాన్యం కొనుగోలు 100% పూర్తి చేసి ఆదివారం చివరి లారీ లోడుతో మూసివేశారు. మండలంలోనే మొదటి గ్రామంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసిన ఘనత తిమ్మారెడ్డిపల్లికి దక్కింది. నిర్వాహకులు మేడల వెంకటేష్, పశువుల భూపాల్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పూర్తయింది. గ్రామంలోని ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. అమాలి కార్మికులు నిరంతరం శ్రమించి రైతులకు మేలు చేశారని అభినందించారు. వర్ష ప్రభావం లేదా రవాణా సమస్యల వల్ల ఇబ్బందులు కలిగితే క్షమించాలని నిర్వాహకులు కోరారు. ఐకెపి సెంటర్ నిర్వహణకు సహకరించిన గ్రామ సర్పంచ్ కొయ్యడ వెంకటి గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మారెడ్డిపల్లి రైతులందరి ధాన్యం కొనుగోలు పూర్తి చేసి ఐకెపి సెంటర్ మూసివేతతో ప్రత్యేక గుర్తింపు పొందింది.

# బుద్ధవనం సందర్శించిన పల్నాడు ఎస్.పి



**నాగార్జునసాగర్ జూన్ 7 ( మహాప్రభ**
నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని ఆదివారంనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా ఎస్ పి కృష్ణారావు సందర్శించారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా ఆయన నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ ను సందర్శించిన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శన లో భాగంగా బుద్ధ చరితవనం,ధ్యానవనం,స్తూపవనాలను సందర్శించి సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం మహాస్తూపంలోని ధ్యాన మందిరాన్ని సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర బుద్ధవనం కండువాలతో బ్రోచర్లతో సత్కరించారు.

# బిజినెస్

## కొత్త కారు కొనాలనే వారికి గుడ్‌న్యూస్..

**- భారీ డిస్కౌంట్లు ప్రకటించిన కంపెనీలు!**



**న్యూఢిల్లీ,**
కొత్త కార్లను కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇది మీకు శుభవార్త. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు ఒకేసారి భారీగా రాయితీని ఇస్తున్నట్టు ప్రకటించాయి. మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్‌లు ఏకంగా తమ మాడళ్లపై రూ.2.15 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు వెల్లడించాయి. ఈ ఆఫర్లు ప్రస్తుత నెలకు మాత్రమే వర్తించనున్నాయని, వీటిని నగదు డిస్కౌంట్, ఎక్స్చేంజ్ బోనస్, స్క్రాపింగ్ ఇన్సెంటివ్స్, లాయల్టీ రివార్డ్, కార్పొరేట్ ప్రయోజనాలు కలుపుకొని ఎంపిక చేసిన మాడళ్లపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపాయి.

**హ్యుందాయ్..**
హ్యుందాయ్ మోటర్స్ ఎంపిక చేసిన మాడళ్లపై లక్ష రూపాయల వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. క్రెటా ఎస్‌యూవీని కొనుగోలు చేసిన వారికి లక్ష రూపాయల వరకు డిస్కౌంట్ ఇస్తున్న సంస్థ..వెర్నాపై రూ.95 వేలు, అప్‌డేటెడ్ మాడల్‌పై రూ.55 వేలు, క్రెటా ఎలక్ట్రిక్ మాడల్‌పై రూ.85 వేల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని ఆటోకార్ ఇండియా తాజాగా వెల్లడించింది. వీటితోపాటు గ్రాండ్ ఐ10 నియోస్‌పై రూ.78 వేలు, అల్కాజర్‌పై రూ.75 వేలు, ఐ20, ఐ20 ఎన్ లైన్ మాడల్‌పై రూ.63 వేలు, ఎక్సటర్‌పై రూ.43 వేల డిస్కౌంట్, ఔరా మాడల్‌పై రూ.25 వేలు, వెన్యూపై రూ.5 ప్రయోజనాలు కల్పిస్తున్నది.

**టాటా మోటర్స్...**
పలు ప్యాసింజర్ వాహనాలపై రూ.55 వేల వరకు రాయితీ ఇస్తున్నట్టు టాటా మోటర్స్ ప్రకటించింది. ఈ ఆఫర్లు 2026లో విడుదలైన ఎస్‌యూవీలు, పంచ్, టియాగో మాడళ్లు ఉన్నాయి. వీటిలో నెక్సాన్‌పై రూ.55 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్న సంస్థ..కర్వ్‌పై రూ.55 వేలు, హారియర్, సఫారీ ఎస్‌యూవీపై రూ.45 వేల వరకు, అల్ట్రోజ్ రూ.40 వేల వరకు, టియాగోపై రూ.35 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది.

**మారుతి కార్లపై**
మారుతి సుజుకీ కూడా రాయితీలను ప్రకటించింది. ఇన్విక్టో ఎంపీవీ పై రూ.2.15 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతోపాటు గ్రాండ్ విటారాపై రూ.1.35 లక్షల వరకు, ఇగ్నిస్‌పై రూ.45 వేలు, బాలెనోపై రూ.40 వేలు, ఎక్స్‌ఎల్‌ఆర్‌పై రూ.45 వేలు, జిమ్నీపై రూ.45 వేలు, ఫ్రాంక్స్‌పై రూ.25 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. వీటిలో ఎక్స్చేంజ్ బోనస్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ డిస్కౌంట్లు ఇస్తున్నది.

## దిగివస్తున్న బంగారం ధర..

**వరుసగా మూడో రోజూ తగ్గుముఖం..!**



దేశంలో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. జూన్ 7 నాటి ట్రేడింగ్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి.. రూ.1,52,730 వద్దకు చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే.. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,000గా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగుతోంది. శనివారం భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా.. వెండి ధరలోనూ రూ.10 వేల మేర తగ్గుదల నమోదైంది.

## నయా ఇన్నోవా క్రిస్టా

**బెంగళూరు, జూన్ 6:**
టయోటా కిర్లోస్కర్ మోటర్..దేశీయ మార్కెట్‌కు నూతన ఇన్నోవా క్రిస్టాను పరిచయం చేసింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసినట్టు, అలాగే కస్టమర్ కోరుకుంటున్న విధంగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.19.72 లక్షల నుంచి రూ.26.63 లక్షల లోపు ధరను నిర్ణయించింది.




# స్పోర్ట్స్

## భారత్ ఆధిపత్యం..

**ఫాలోఆన్ ముంగిట పర్యాటక జట్టు**




ముల్లాన్‌పూర్: అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌పై భారత జట్టు తొలి రోజే సాధించిన ఆధిపత్యాన్ని రెండో రోజు మరింత సుస్థిరం చేసుకుని, మ్యాచ్‌ను పూర్తిగా తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. 368/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్.. అఫ్గాన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల భారీ స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ సెంచరీ హీరో శుభ్‌మన్ గిల్ (126) మరోసారి క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించగా, రిషభ్ పంత్ 81 పరుగుల క్లాసిక్ నాక్‌తోనూ, ఆఖర్లో వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) బాధ్యతాయుత హాఫ్ సెంచరీతోనూ మెరిశారు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ సలీమ్ సఫీ 6 వికెట్లతో ఒంటరి పోరాటం చేసినా భారత బ్యాటర్ల జోరును అడ్డుకోలేకపోయాడు. అనంతరం భారత బౌలర్ల ధాటికి అఫ్గానిస్థాన్ టాప్ ఆర్డర్ క్రీజులో నిలవలేక పూర్తిగా విలవిల్లాడింది. ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్ల ప్రదర్శన చేయడంలో అఫ్గాన్ బ్యాటర్లు అబ్దుల్ మాలిక్ (16), సెదిఖుల్లా అటల్ (17), రహ్మనుల్లా గుర్బాజ్ (12), హస్మతుల్లా షాహిది (20) తక్కువ పరుగులకే చేతులెత్తేశారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్గానిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు మాత్రమే చేసి తీవ్ర పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్రస్తుతం రహ్మత్ షా (43 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తుండగా, ఆ జట్టు ఇంకా 451 పరుగుల భారీ వెనకంజలో ఉంది. భారత్ ప్రదర్శించిన ఈ ఆల్‌రౌండ్ ఆధిపత్యంతో అఫ్గానిస్థాన్‌కు ఫాలోఆన్ గండం స్పష్టంగా కనిపిస్తోంది.

## సూర్యకుమార్ యాదవ్‌కు అన్యాయం జరిగిందా?

**సెలెక్టర్ల నిర్ణయంపై భారత క్రికెట్ దిగ్గజం ఫైర్**




టీమిండియా టీ20 కెప్టెన్సీ నుంచి సూర్యకుమార్ యాదవ్‌ను తొలగించడంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఘాటుగా స్పందించారు. భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన వెంటనే, కేవలం ఐపీఎల్‌లో ప్రదర్శన బాగోలేదనే కారణంతో అతడిని కెప్టెన్సీ నుంచి తప్పించడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఒక ఆటగాడి భవిష్యత్తును నిర్ణయించేటప్పుడు కేవలం ఐపీఎల్ ఫామ్‌నే ప్రామాణికంగా తీసుకోవడాన్ని గవాస్కర్ తప్పుబట్టారు. తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో గవాస్కర్ మాట్లాడుతూ.. "సూర్యకుమార్ యాదవ్‌కు అన్యాయం జరిగిందని కొందరు అంటున్నారు, అది నిజమే కావచ్చు. 2028లో టీ20 ప్రపంచ కప్, ఒలింపిక్స్ ఉన్నాయి. కనీసం రాబోయే ఇంగ్లాండ్ సిరీస్ వరకు అతడికి అవకాశం ఇచ్చి చూడాల్సింది. ఆ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అతడి ప్రదర్శనను చూసిన తర్వాతే సెలెక్టర్లు ఒక నిర్ణయానికి వచ్చి ఉంటే బాగుండేది" అని స్పష్టం చేశారు. ఐపీఎల్ 2026లో సూర్య సరిగ్గా ఆడకపోవడం సెలెక్టర్ల నిర్ణయానికి మరింత బలాన్ని ఇచ్చి ఉండవచ్చని ఆయన విశ్లేషించారు. అయితే సెలెక్టర్ల ఆలోచనా విధానం మరోలా ఉండి ఉండవచ్చని కూడా గవాస్కర్ పేర్కొన్నారు. మార్పు అనేది ఇప్పుడే మొదలుపెట్టాలని వారు భావించి ఉండవచ్చని చెప్పారు. "సూర్య వయసు ఇప్పుడు 35 లేదా 36 ఏళ్లు. 2028 నాటికి అతడికి 38 ఏళ్లు వస్తాయి. ఆ సమయంలో ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ గెలవాలన్నా, వరల్డ్ కప్ నిలబెట్టుకోవాలన్నా యంగ్ కెప్టెన్ అవసరం. అందుకే శ్రేయస్ అయ్యర్ లాంటి అనుభవం ఉన్న యువ ఆటగాడిని ఎంపిక చేసి ఉండవచ్చు" అని గవాస్కర్ విశ్లేషించారు. కెప్టెన్సీ నుంచి తప్పించినప్పటికీ, సూర్య వ్యక్తిత్వాన్ని గవాస్కర్ ఆకాశానికెత్తారు. మైదానంలో సూర్య ప్రవర్తన మహేంద్ర సింగ్ ధోనీలాగే ఎంతో ప్రశాంతంగా ఉంటుందని కొనియాడారు. "సూర్య తన ప్రశాంత స్వభావాన్ని జట్టుకు వారసత్వంగా వదిలి వెళ్తాడు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఒత్తిడికి లోనుకాకుండా జట్టును నడిపించడంలో అతడు ధోనీని పోలి ఉంటాడు" అని గవాస్కర్ ఇండియా టుడేతో మాట్లాడుతూ ప్రశంసించారు.

## ప్లీజ్..అతడితో పాటు మీరు వెళ్లండి..!


**వైభవ్ సూర్యవంశీ తల్లిదండ్రులకు బీసీసీఐ విన్నపం**




**హైదరాబాద్**
అద్భుతమైన ఆటతో సంచలనాలు సృష్టిస్తున్న చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ తల్లిదండ్రులకు బీసీసీఐ అరుదైన ఆహ్వానాన్ని పలికింది. ఇంగ్లండ్, ఐర్లాండ్ టూర్ కోసం వైభవ్ తల్లిదండ్రులను కూడా రమ్మని రెక్వెస్ట్ చేసింది. ఈ సందర్భంగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ..వైభవ్ ఇంకా 15 ఏండ్ల చిన్న పిల్లాడు. అతడు సీనియర్లతో కలువడానికి కొంత సమయం పడుతుందన్నారు. సాధారణంగా భారత జట్టు పర్యటనల సమయంలో ఆటగాళ్లతో పాటు వారి తల్లిదండ్రులను అనుమతించం. కానీ, ఓ ప్రత్యేక పరిస్థితుల్లో వైభవ్ కుటుంబానికి ప్రత్యేక అనుమతి ఇస్తున్నామని సైకియా తెలిపారు.ఇండియా-ఏ జట్టు తరఫున శ్రీలంక పర్యటనకు వైభవ్ వెళ్తున్నాడు. అతడి తండ్రి కూడా వెళ్తున్నాడు.
అలాగే ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనకు కూడా సూర్యవంశీ పేరెంట్స్ వెళ్తే తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. వైభవ్ పెద్ద వాళ్లతో కలువడానికి కొంత సమయం పడుతుందని ఈ సమయంలో వారి తల్లిదండ్రులు అతడి వెంట ఉండటం శ్రేయస్కరమని భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని సైకియా తెలిపారు. వారికి ఇష్టం ఉంటే వెళ్తేనే బాగుంటుందని ఇప్పటికే వైభవ్ కుటుంబానికి సమాచారం చేరవేశామన్నారు. కాగా, తన కెరీర్‌లో మొదటిసారిగా సీనియర్ జట్టులో భాగం కాబోతున్న యువ ఆటగాడు వైభవ్ కోసం BCCI ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 16 ఏళ్ల 207 రోజుల వయసులో అరంగేట్రం చేసిన సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును అధిగమించి, భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన ఆటగాడిగా వైభవ్ నిలిచే అవకాశం ఉంది. మరోవైపు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సైతం వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. తన ప్రతిభే తనను జాతీయ జట్టుకు ఎంపిక చేసిందని పేర్కొన్నాడు.

# రవితేజ 'ఇరుముడి' రిలీజ్ డేట్ ఫిక్స్..

## –తెలుగు, తమిళ ప్రేక్షకుల ముందుకు ఎప్పుడంటే?




మాస్ మహారాజా రవితేజ హీరోగా, దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచగా, తాజాగా చిత్ర బృందం అభిమానులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. చిత్ర యూనిట్ వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఇరుముడి' చిత్రం 2026 ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్న ఈ సినిమాను రెండు పరిశ్రమల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు.తెలుగులో 'ఇరుముడి' పేరుతో విడుదల కానున్న ఈ చిత్రం, తమిళంలో 'ఇరుముడికట్టు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభించడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ గురించి గతంలో రవితేజ మాట్లాడిన మాటలు కూడా ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. "కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి కథే 'ఇరుముడి'. ఈ ప్రయాణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. కొత్త అనుభవం కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని రవితేజ పేర్కొన్నారు.ఈ చిత్రంలో ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే బాలనటి బేబీ నకాస్త్ర కీలక పాత్రలో కనిపించనుంది. సినిమాలో ఆమె రవితేజ కుమార్తె పాత్రను పోషిస్తున్నట్లు సమాచారం. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఈ పాత్ర కథలో కీలకంగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'ఇరుముడి' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. సంగీత సంచలనం జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన స్వరపరచనున్న పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన చిత్రంగా 'ఇరుముడి' నిలుస్తుందనే అభిప్రాయాలు ఇప్పటికే వ్యక్తమవుతున్నాయి. శివ నిర్వాణ భావోద్వేగ కథన శైలి, రవితేజ ఎనర్జీ, బలమైన కథాంశం కలగలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా వచ్చే ఏడాది ఆగస్టు 21న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## అందాలు ఆరబోస్తున్న నేహా శెట్టి,

# సేఫ్టీ బెల్ట్ లేకుండా 80 కిలోల బరువు..


## – 40 రోజులు నరకం చూశానన్న రకుల్ ప్రీత్ సింగ్!



ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా వెల్లడించింది. జిమ్‌లో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా వర్కవుట్ చేయడం వల్లే తాను పెద్ద ప్రమాదంలో పడ్డానని ఆమె తెలిపారు. ఇటీవల నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో ఎలాంటి సేఫ్టీ బెల్ట్ ధరించకుండా 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎత్తడానికి ప్రయత్నించానని, ఆ చిన్న పొరపాటు వల్ల తనకు తీవ్రమైన స్లిప్ డిస్క్ సమస్య వచ్చిందని చెప్పారు. ఆ గాయం కారణంగా తాను ఏకంగా 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామమని, అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమేనని రకుల్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ ప్రమాదం వల్ల కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని వివరించారు. ఎప్పుడూ ఎంతో చురుకుగా ఉండే తాను, కనీసం రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ గాయం తనను శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎంతో కృంగదీసిందని రకుల్ కన్నీరు పెట్టారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు కొండంత అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె కొనియాడారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను కూడా ఈ షోలో పంచుకున్నారు. ప్రస్తుతం రకుల్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి

# త్రిషకు సీక్రెట్‌గా పెళ్లయిందా?..

## -- నెట్టింట వైరల్‌గా మారిన 'మంగళసూత్రం' ఫోటో!




సౌత్ స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ పెళ్లిపై సోషల్ మీడియాలో మరోసారి ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఆమె మెడలోని ఒక లాకెట్ ఇప్పుడు నెట్టింట తీవ్ర దుమారం రేపుతోంది. ఒక ఫొటోలో త్రిష ధరించిన పెండెంట్‌ను నిశితంగా గమనించిన నెటిజన్లు, అది వంద శాతం కేరళ క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో ఉండే 'మిన్ను' (మంగళసూత్రం) అని వాదిస్తున్నారు.దీంతో ఇంటర్నెట్‌లో ఒక్కసారిగా ఊహాగానాలు ఊపందుకున్నాయి. అసలు త్రిషకు సీక్రెట్‌గా పెళ్లయిపోయిందా? పెళ్లికూతురు ఇక్కడే ఉంది కానీ పెళ్లికొడుకు ఎక్కడ? అంటూ అభిమానులు, నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అయితే, ఇది కేవలం ఏదైనా సినిమా షూటింగ్‌కు సంబంధించిన లుక్ అయ్యుండవచ్చని, లేదా సాధారణ జ్యువెలరీ డిజైన్ అయ్యుండవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా త్రిష పెళ్లిపై అనేక రూమర్స్ రాగా, ఆమె వాటిని కొట్టిపారేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి ఈ వైరల్ పిక్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అయితే దీనిపై త్రిష టీమ్ ఇప్పటివరకు స్పందించలేదు..

# బిగ్ బాస్ తెలుగు 10కి రంగం సిద్ధం..

## నాగార్జున పవర్‌ఫుల్ ప్రోమో వైరల్!




తెలుగు బుల్లితెర ప్రేక్షకులను ఎన్నో ఏళ్లుగా అలరిస్తున్న అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' మరో సరికొత్త మైలురాయిని చేరుకోబోతోంది. విజయవంతంగా తొమ్మిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో ఇప్పుడు పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ముగిసిన సీజన్-9లో కామన్ మ్యాన్ కళ్యాణ్ పడాల విజేతగా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. తాజాగా స్టార్ మా విడుదల చేసిన 'బిగ్ బాస్ తెలుగు 10' అధికారిక ప్రోమో సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకుంటోంది. ఎప్పటిలాగే కింగ్ నాగార్జున తన స్టైలిష్ లుక్, ఎనర్జీతో ప్రోమోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈసారి ప్రోమోను మరింత గ్రాండ్‌గా, భావోద్వేగాలకు దగ్గరగా రూపొందించారు.ప్రోమోలో నాగార్జున మాట్లాడుతూ.. "బిగ్ బాస్ అంటే ఎన్నో యుద్ధాలు గెలిచిన రాజ్యం మాత్రమే కాదు.. లక్షలాది హృదయాలను గెలుచుకున్న మహా సామ్రాజ్యం" అంటూ షో ప్రస్థానాన్ని గుర్తు చేశారు. ఈ సామ్రాజ్యాన్ని నడిపేది తాను కాదని, బిగ్ బాస్‌ను ప్రేమించే ప్రేక్షకులేనని చెప్పడం అభిమానులను ఆకట్టుకుంది. ఈసారి ప్రోమోలో సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను చూపించారు. సెలూన్ షాపుల నుంచి ఐటీ కార్యాలయాల వరకు, కుటుంబ సభ్యుల నుంచి యువత వరకు అందరూ బిగ్ బాస్ కోసం ఎలా ఎదురుచూస్తారో చూపిస్తూ షో ప్రజల్లో ఎంతటి ఆదరణ సంపాదించుకుందో ప్రతిబింబించారు. ఎమోషన్స్, టాస్కులు, గొడవలు, స్నేహాలు, వినోదం కలగలిసిన ఈ షో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతుందనే సంకేతాలను ఇచ్చారు.ప్రోమోలో వినిపించిన "నాగ్ సార్‌కి మేము కల్ట్ ఫ్యాన్స్" అనే బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ ప్రోమోకు లక్షలాది వ్యూస్ రావడంతో పాటు అభిమానులు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇక ప్రోమో చివర్లో నాగార్జున చెప్పిన డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "ఈ ప్రస్థానం మరో కొత్త చాప్టర్‌కు సాక్ష్యం కాబోతోంది. ఈసారి మీరు చూడబోయేది బిగ్ బాస్ దశావతారం. ఈసారి ఆటలో సవాల్ కాదు... ఆటే సవాల్!" అంటూ ఆయన చెప్పడంతో షోపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఈ వ్యాఖ్యలను బట్టి చూస్తే, పదో సీజన్‌లో కంటెస్టెంట్ల ఎంపిక, టాస్కులు, గేమ్ ప్లాన్ గత సీజన్ల కంటే మరింత ఉత్కంఠభరితంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుల్లితెర ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'బిగ్ బాస్ తెలుగు 10' త్వరలోనే ప్రారంభం కానుండగా, ఈసారి ఎలాంటి సంచలనాలు నమోదవుతాయో చూడాలి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com